సాక్షి
నల్లగొండ
ఆదివారం । 21 । జూలై । 2024



సమగ్ర కులగణన జరపాలి

ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. - 8లో



గంజాయి ముఠా అరెస్ట్

మునుగోడులో కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. - 10లో



కాలుష్యాన్ని నియంత్రించాలి

మూసీ కాలుష్యాన్ని నియంత్రించాలని ఏఐకేఎస్ జాతీయ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం నల్లగొండకు రానున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 7 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బయల్దేరి 8.30 గంటలకు నార్కట్‌పల్లి మండలం గోపాలయపల్లిలో గల వారిజాల వేణు గోపాలస్వామి ఆలయంలో జరిగే సుదర్శన యాగ సహిత రుద్రయాగంలో పాల్గొంటారు. 10.30 గంటలకు నల్లగొండలోని రామగిరి సాయిబాబా ఆలయానికి వెళ్లి గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. తర్వాత యాదాద్రి భువనగిరి జిల్లా మల్కాపురంలో ఆంథోల్‌మైసమ్మ ఆలయం వద్ద జరిగే కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ వెళ్తారు.

23న ఇన్‌స్పైర్ మనక్‌పై అవగాహన సదస్సు

నల్లగొండ : ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల నామినేషన్లపై సైన్స్ ఉపాధ్యాయులకు ఈ నెల 23న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యారుల నుంచి సైన్స్ ఉపాధ్యాయులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో నామినేషన్లు పంపేలా అవగాహన కల్పిస్తామమని తెలిపారు. డైట్ కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు నల్లగొండ డివిజన్ సైన్స్ ఉపాధ్యాయులు, 2 గంటలకు మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్ల వారు అవగాహన సదస్సుకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి 9848578845 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

జిల్లా జైల్ సూపరింటెండెంట్‌గా ప్రమోద్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రమోద్

నల్లగొండ క్రైం : జిల్లా జైల్ సూపరింటెండెంట్‌గా జి.ప్రమోద్ నియమితులయ్యారు. నాలుగేళ్ల పాటు ఇక్కడ విధులు నిర్వహించిన ఎం.దేవ్లా నాయక్‌ను చర్లపల్లి సెంట్రల్ జైల్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జైల్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న జి.ప్రమోద్‌ను పదోన్నతిపై నల్లగొండ జిల్లా జైల్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేసింది. నూతన సూపరింటెండెంట్ ప్రమాద్ శనవారం జిల్లా జైల్‌లో బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న దేవ్లానాయక్.. ప్రమోద్‌కు బోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమయపాలన పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా సెక్టోరియల్ అధికారి వీరయ్య

నకిరేకల్ : ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి వీరయ్య సూచించారు. నకిరేకల్‌లోని ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వర్షం కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశానికి హాజరు కాలేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ నాగయ్య, హెచ్‌ఎం ప్రమీల ఉన్నారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి నిత్యకల్యాణ వేడుక శనివారం నేత్రపర్వంగా చేపట్టారు. వేకువజామునే గర్భాలయంలో సుప్రభాత సేవ చేపట్టిన అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఇక ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ ప్రాకార మండపంలో ఊరేగించారు. నిత్యకల్యాణం, వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రోజంతా ముసురు



నల్లగొండ అగ్రికల్చర్ : ఉపరితల ద్రోణి, అల్పపీడనం కారణంగా జిల్లా అంతటా ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. రెండు రోజులుగా చిరు జల్లులతో ప్రారంభమైన వర్షం శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు కూడా ఎడతెరిపి లేకుండా ముసురు పెట్టింది. దీంతో పట్టణాలతో పాటు పల్లెల్లో వీధులన్నీ చిత్తడిగా మారాయి. పట్టణంలోని లోతట్టు కాలనీల్లో నీరు నిలిచి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. మరో 2, 3 రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

14.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

జిల్లాలో 14.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా వేములపల్లి మండలంలో 31.5 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నేరడుగొమ్ములో 1.3 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. దామరచర్లలో 30.2, నల్లగొండ 29.9, కేతేపల్లి 27.8, మాడ్గులపల్లి 27.8, తిప్పర్తి 26.5, కనగల్ 23.4, మునుగోడు 23.3, మిర్యాలగూడ 21.8, నకిరేకల్ 20.5, త్రిపురారం 20.2, నిడమనూరు 19.6, చండూరు 18.1, నార్కట్‌పల్లి 16.7, కట్టంగూర్ 16.5, అనుముల 15.4, అడవిదేవులపల్లి 12.6, శాలిగౌరారం 11.5, చిట్యాల 10.4, గుండ్లపల్లి 8.8, మర్రిగూడ 7.6, గుర్రంపోడు 7.3, నాంపల్లి 7.0, తిరుమలగిరిసాగర్ 6.6, గట్టుప్పల్ 6.3, పీఏపల్లి 5.2, పెద్దవూర 4.9, చింతపల్లి 4.9, చందంపేట 3.5, దేవరకొండ 2.8, కొండమల్లేపల్లిలో 2.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

సాగర్‌లో నేడు ధర్మచక్ర పరివర్తన దినోత్సవం

నాగార్జునసాగర్ : తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ నాగార్జునసాగర్ జలాశయతీరంలో నిర్మించిన బుద్ధవనంలో ఆదివారం ధర్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఆరు సంవత్సరాల కఠోర సాధన అనంతరం సిద్ధార్థుడు బుద్ధుడై తాను అనుభవ పూర్వకంగా తెలుసుకున్న నాలుగు సత్యాలను ఆర్య అష్టాంగమార్గాన్ని, మధ్యేమార్గం, ప్రతీత్య సముత్పాదమనే ధర్మచక్ర పరివర్తన సూత్రాన్ని ఆషాఢ పూర్ణిమ రోజున బోధించాడని, ఈరోజును ధర్మచక్ర పరివర్తన దినోత్సవంగా బుద్ధవనంలో జరుపుతున్నామని ఆయన తెలిపారు. ఉదయం 11గంటలకు మహాస్థూపం సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి బౌద్ధభిక్షువులు, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, భూటాన్ మాజీ విద్యాశాఖ మంత్రి ఆచార్యఠాకూర్ సింగ్ పొడ్యేల్, ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ మధుసారథి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, బౌద్ధ అభిమానులు పాల్గొంటారని తెలిపారు.

● ఎత్తిపోతలకు జలకళ



తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సరిహద్దు నాగార్జునసాగర్ సమీపంలోని ఎత్తిపోతల జలపాతం జలకళను సంతరించుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో 70 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న నీటి దృశ్యం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. - నాగార్జునసాగర్

మాఫీ కాలేదు సారూ..!

రుణమాఫీ పొందని రైతుల నుంచి అధికారులకు ఫిర్యాదులు

- కుటుంబం యూనిట్ తీసుకోవడంతో రైతులకు తిప్పలు
- రేషన్‌కార్డులు వేర్వేరుగా ఉన్నా ఒక్కరికే వర్తింపు
- ఖాతాల్లో పేర్లకు, ఆధార్‌కు మధ్య తేడా కారణంగా అందని మాఫీ
- బ్యాంకర్ల అత్యుత్సాహం.. పంట రుణానికి సేవింగ్ అకౌంట్స్‌లోని డబ్బు జమ



వ్యవసాయ కార్యాలయంలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రూ.లక్షలోపు రుణమాఫీ అమలుకాని రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ అందలేదని అనేక మంది రైతులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. మొదటి రెండు రోజుల్లోనే జిల్లా యంత్రాంగానికి వందకు పైగా ఫిర్యాదులు అందాయి. జిల్లా స్థాయిల్లో ఏఈవో, ఏవో, ఏడీఏ, డీఏవోలకు రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. తమకు రుణమాఫీ జరిగిందో లేదో తెలుసుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రూ.లక్షలోపే రుణం ఉన్నా ఎందుకు మాఫీ కాలేదంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో కొందరు బ్యాంకర్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఒకే బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్, పంట రుణం అకౌంట్ ఉంటే చాలు సేవింగ్ అకౌంట్‌లో ఉన్న డబ్బును పంట రుణం అకౌంట్‌లోని అప్పు కింద మినహాయించుకుంటున్నారు.

3వేల అకౌంట్ల 'ట్రాన్జాక్షన్ ఫెయిల్యూర్'

నల్లగొండ జిల్లాలో రైతుల నుంచి 101 ఫిర్యాదులు జిల్లా వ్యవసాయ అధికారులకు అందాయి. అందులో 21 ఫిర్యాదులు నేరుగా అందజేయగా, మిగతా వారు టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు 83 వేల అకౌంట్లలో 3వేల అకౌంట్ల వివరాలు మిస్ మ్యాచ్ కావడం వల్ల డబ్బులు పడలేదని, ట్రాన్జాక్షన్ ఫెయిల్యూర్ అని వచ్చిందని అధికారులు చెబుతున్నారు. చాలా మంది రూ.80 వేలు, రూ.90 వేలు రుణాలు తీసుకున్న వారు తమకు అంతే ఉందని అనుకుంటున్నారని, అవి రెండు వేర్వేరు బ్యాంకు ఖాతాలు కాబట్టి వేర్వేరుగా రుణమాఫీ చేస్తారని అనుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు. రెండింటిని కలిపి చూస్తారనే విషయం తెలియక తమకు రుణమాఫీ కాలేదని వస్తున్నట్లు వెల్లడించారు. రెండింటిలో ఎంత మొత్తం ఉందనే దాని ప్రకారమే రుణమాఫీ అవుతుందని, రూ.లక్షకు మించి ఉంటే కాలేదని వివరిస్తున్నారు. ఇలాంటి ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయని పేర్కొంటున్నారు. కుటుంబంలో ఇద్దరి పేరుతో వేర్వేరుగా తీసుకున్న రుణాల మాఫీ కాలేదు. రెండు కలిపి చూడటం వల్లే మాఫీ కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. రేషన్‌కార్డులో పేరు లేకపోతే రుణమాఫీ పడలేదు. వాటిని క్షేత్రస్థాయిలో వెరిఫై చేసి ప్రభుత్వం ఇస్తుందని చెబుతున్నారు. డీసీసీబీపాటు మరో బ్యాంకులో లోన్ తీసుకున్నా ఆ రెండు ఖాతాలను మెర్జ్ చేసి మొత్తం ఎంత రుణం ఉందనేది చూసి చేస్తుందని అధికారులు వివరిస్తున్నారు. రూ.లక్షకుపైగా రుణం ఉన్న వారి నుంచి కూడా ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సేవింగ్ అకౌంట్స్ నుంచి మినహాయింపు

నల్లగొండ జిల్లా ఘట్టుప్పల్‌కు చెందిన ఓ రైతు గత ఏడాది జూలై 4న రూ.1,63,000 పంట రుణం తీసుకున్నాడు. దానికి సంబంధించిన ఖాతా వేరు. అదే బ్యాంకులో సదరు రైతుకు సేవింగ్స్ అకౌంట్ ఉంది. అయితే బ్యాంకు వారు సేవింగ్స్ అకౌంట్‌లో ఉన్న రూ.65,767.60 మొత్తాన్ని పంట రుణం ఖాతాలోకి జమ చేసుకున్నారు. సదరు రైతు వెళ్లి ఇదేంటని అడిగితే.. లోన్ రెన్యూవల్ చేయని కారణంగా ఆ డబ్బు సేవింగ్స్ అకౌంట్‌లో కట్ అయి పంట రుణం ఖాతాలోకి జమ అయిందని, అప్పు కింద మినహాయింపు జరిగిందని చెబుతున్నాయి. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఎదురుచూస్తుంటే బ్యాంకు ఉన్న మొత్తాన్ని కట్ చేసుకోవడం ఏంటని సదరు రైతు ప్రశ్నిస్తున్నాడు.

మరికొంత సమయం పడుతుంది



ఆధార్ నంబరు, పేర్లు, ఇతర వివరాలు మిస్ మ్యాచ్ కావడం, రేషన్ కార్డులో పేరు లేకపోవడం వంటి వారికి రుణమాఫీ కాలేదు. ప్రభుత్వం అందరికీ ఇస్తామని చెబుతోంది. ఇందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

- శ్రావణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

రూ.50 వేల రుణం మాఫీ కాలేదు



మాది జాజిరెడ్డిగూడెం మండల కేంద్రం. మాకు డి.కొత్తపల్లి శివారులో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. గతేడాది అక్టోబర్‌లో నాగారంలోని కెనరా బ్యాంక్‌లో రూ.50 వేలు పంట రుణం తీసుకున్నా. ప్రస్తుతం అది మాఫీ కాలేదు.

- శోభనబోయిన సంధ్య, జాజిరెడ్డిగూడెం

రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు



నాకు 2.13 ఎకరాల భూమి ఉంది. నారాయణపురంలోని ఎస్‌బీఐలో అసలుతోపాటు వడ్డీ కలిపి రూ.67 వేలు బకాయి ఉంది. అందులో వడ్డీ రూ.7 వేలు చెల్లించా. అసలు అలాగే ఉంది. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు.

- ఇస్తారి, జనగాం, సంస్థాన్‌నారాయణపురం

అనుమతి లేకుండా గైర్హాజరు కావద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం తనిఖీ
- పరిపాలన అధికారి సస్పెండ్



ఫోన్‌లో డీఏఓతో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ ఉద్యోగులంతా సమయపాలన పాటించాలని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావద్దని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా, సెలవు పెట్టకుండా మూడు రోజులు విధులకు హాజరుకాని కార్యాలయ పరిపాలన అధికారి (ఏఓ) అబ్దుల్ మన్నన్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. రుణమాఫీ గ్రీవెన్స్ విభాగాన్ని పరిశీలించారు. రుణమాఫీ రాలేదని కార్యాలయానికి వచ్చే రైతులకు పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఇందు కోసం రెండు ఫోన్ నంబర్లను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కంప్యూటర్‌లో లాగిన్ అయి రుణమాఫీ ఎందుకు జమ కాలేదో తెలిపేందుకు ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను, వారికి సహాయకులుగా ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లను నియమించాలని డీఏఓ శ్రవణ్‌కుమార్‌ను ఫోన్‌లో ఆదేశించారు. ఆ సమయంలో తనకు డబ్బులు రాలేదని డీఏఓ కార్యాలయానికి వచ్చిన చింతమల్ల సందీప్‌కుమార్‌తో కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

సేవా కేంద్రాలు పకడ్బందీగా పనిచేయాలి

నల్లగొండ : మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు పకడ్బందీగా పనిచేయాలి కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన వివిధ అంశాలపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో రూ.లక్ష లోపు రుణాలు మాఫీ అయిన రైతులు సుమారు 83 వేల మంది ఉండగా, ఇప్పటివరకు 80 వేలమంది ఖాతాల్లో డబ్బు జమైందని తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి తదతరులు ఉన్నారు.

చిన్నారులను ఎత్తుకుని లాలించి..



శిశు గృహలో చిన్నారిని చేతుల్లోకి తీసుకున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : నల్లగొండలోని శిశుగృహను శనివారం సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి చిన్నారులను ఎత్తుకుని లాలించారు. ఈ సందర్భంగా అక్కడ 4వ తరగతి చదువుతున్న చిన్నారి పూజిత తనను తల్లిదండ్రులు చదువు మాన్పించగా శిశుగృహకు వచ్చినట్లు కలెక్టర్‌కు తెలిపింది. స్పందించిన కలెక్టర్ ఆ బాలికను మంచి పాఠశాలలో చేర్పించి, భోజనం, దుస్తులు ఇప్పిస్తామని తెలిపారు. అనంతరం సఖి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ జూలైలో కేసుల వివరాలను అడగగా.. 28 కేసులు నమోదయ్యాయని నిర్వాహకులు తెలిపారు. సఖి కేంద్రం పనితీరుపై కలెక్టర్ స్వయంగా 181 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. స్వధార్ గృహ కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడి మహిళలతో మాట్లాడారు. ఈ కేంద్రంలో డిగ్రీ, ఇంటర్, ఏఎన్‌ఎం కోర్సులు చేస్తూ మధ్యలో వదిలేసిన వారు ఉండగా, వారి చదువులు పూర్తి చేసేందుకు ఫీజులు చెల్లించాలని నిర్వాహకులకు తెలిపారు.

నక్కలగండిని త్వరగా పూర్తి చేయాలి



ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గంలో సీపీఎం బృందం

చందంపేట : నక్కలగండిని త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులను సీపీఎం నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో ప్రారంభమైన ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులు 2014 వరకు 28 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయని తెలిపారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పదేళ్ల పాలనలో పది కిలోమీటర్లు మాత్రమే పనులు జరిగాయని పేర్కొన్నారు. మరో 9 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉండగా ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం మారుతున్నప్పుడల్లా బడ్జెట్ పెరుగుతుందని, తాజాగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. ఎస్‌ఎల్‌బీసీ పూర్తయితే దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి ఇబ్బందులు తీరుతాయన్నారు. ఎక్కువ ఖర్చుతో కూడుకున్న ప్రాజెక్టులను ఆగమేఘాలపై పనులు చేస్తున్న ప్రభుత్వం పైసా నిర్వాహణ లేకుండా గ్రావిటీ ద్వారా నీరు వచ్చే ఎస్‌ఎల్‌బీసీపై పట్టింపు లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. రూ.1500 కోట్లు ఇస్తే పూర్తయ్యే ప్రాజెక్టుపై నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కాలపరిమితిని నిర్ణయించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం నక్కలగండి బండ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు బొంతల చంద్రారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వీరారెడ్డి, మల్లేషం, శ్రీశైలం, నాగార్జున, ప్రభావతి, లక్ష్మీనారాయణరెడ్డి, ఆనంద్, వెంకటేశ్వర్లు, సలీం, నర్సిరెడ్డి తదితరులున్నారు.

రుణమాఫీ ఫిర్యాదులకు ప్రత్యేక సెల్

నల్లగొండ టౌన్ : పంట రుణమాఫీ - 2024 పథకం అమలుకు సంబంధించి జాబితాలో పేరు లేని వారి ఫిర్యాదుల కోసం జిల్లా వ్యవసాయ శాఖాధికారి కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) శ్రవణ్‌కుమార్ తెలిపారు. కాల్ సెంటర్ నంబర్లకు (72888 00023, 72888 00016, 72888 00017) ఫోన్ చేసి రైతులు తమ ఆధార్ నంబర్‌ను అధికారులకు తెలియజేసి రుణమాఫీ ఎందుకు కాలేదో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారిని ఫోన్ ద్వారా లేదా నేరుగా కలిసి సమస్యకు పరిష్కారం పొందవచ్చని సూచించారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతులు కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.



కంప్యూటర్‌లో ఫిర్యాదులను చూస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

సాగు అంచనా తప్పింది!

- వ్యవసాయ శాఖ అంచనా 11.40 లక్షలు ఎకరాలు
- ఇప్పటి వరకు సాగైంది 3.60 లక్షల ఎకరాల్లోనే..



నల్లగొండ అగ్రికల్చర్: వానాకాలం సాగుపై జిల్లా వ్యవసాయ శాఖ అంచనాలు తలకిందులయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 11.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగుకానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈనెలాఖరు వరకు వానాకాలం సీజన్ ముగుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు కేవలం 3.60లక్షల ఎకరాల్లో మాత్రమే పత్తి, వరి, ఇతర పంటలు సాగుకు నోచుకున్నాయి. సీజన్‌లో పత్తి 6లక్షల ఎకరాల్లో సాగు కానుందని అంచనా వేసినా కేవలం 3.46 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. వరి కేవలం 15,658 ఎకరాల్లో నాట్లు వేసుకోగా సుమారు 2లక్షల ఎకరాలకు సరిపడా రైతులు నార్లు పోసుకుని సిద్ధంగా ఉన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని ఆయకట్టు ప్రాంతంలో బోర్ల కింద కొందరు రైతులు వరినార్లు పోసుకోగా మరికొందరు నార్లు పోసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

వర్షంతో పత్తికి ప్రాణం

జిల్లాలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన జూన్ మొదటి వారంలో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రైతులు పత్తిగింజలు నాటారు. అక్కడక్కడా చిరు జల్లులు తప్ప ఎక్కడా పెద్ద వర్షాలు కురవలేదు. దీంతో పత్తిచేలు వాడుపడుతున్న దశలో రెండు రోజులుగా చిరు జల్లులతో కుడిన వర్షాలు జిల్లా అంతటా కురుస్తుండటం వల్ల పత్తి చేలకు జీవం పోసినట్లయింది. పత్తి చేలు కళకళ లాడుతున్నాయి. వర్షం తగ్గితే ఎరువులు పెట్టేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

వాతావరణ శాఖ లెక్కలూ గందరగోళం

ఈ సీజన్‌లో జిల్లాలో మంచి వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ లెక్కలు చెపుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో 152.8 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 197.1 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అంటే సాధారణ వర్షం కంటే 29.0 శాతం అధిక వర్షం కురిసిందని గణాంకాలు చెబుతున్నాయి. అంటే 6 మండలాల్లో అత్యధిక వర్షం, 12 మండలాల్లో అధిక వర్షం, 12 మండలాల్లో సాధారణ వర్షం, చిట్యాల, అడవిదేవులపల్లి మండలాల్లో మాత్రమే సాధారణ కంటే తక్కువ వర్షం కురిసినట్లు వాతావారణ శాఖ లెక్కలు ఉన్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో సాధారణ కంటే ఎక్కువ వర్షం కురిస్తే చెరువులు, కుంటలు ఎందుకు నిండలేదు. వరినాట్లు ఎందుకు వేసుకోలేదు. భూగర్భ జలాలు ఇంకి బోర్లు ఎందుకు ఎండిపోయాయో వాతావరణ శాఖ లెక్కలు చెప్పాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు మృతి


ఎల్లమ్మ (ఫైల్)

రాజాపేట: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు తాళ్లపల్లి ఎల్లమ్మ (101) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. వారం రోజుల క్రితం వరకూ ఎల్లమ్మ తన పనులు తాను చేసుకునేదని అనారోగ్యానికి గురి కావడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎల్లమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, 9 మంది మనుమళ్లు, మనుమరాళ్లు ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధురాలు మృతి


సుగుణమ్మ (ఫైల్)

చిట్యాల: పట్టణంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. శనివారం చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన సంగిశెట్టి సుగుణమ్మ(68) శుక్రవారం వనిపాకల రోడ్డులో గల తమ బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి సాయంత్రం తన ఇంటికి వచ్చేందుకు జెడ్పీహెచ్‌ఎస్ సమీపంలోని జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన సుగుణమ్మను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సుగుణమ్మ అదేరోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

రామగిరి (నల్లగొండ): తిప్పర్తి మండలంలోని పెద్దసూరారం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. గ్రామానికి చెందిన గుండె ఐశ్వర్య (19) శుక్రవారం కిరాణాషాపునకు సరుకులు తీసుకురావడానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి కోటయ్య శనివారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

నిండా మునిగిన బత్తాయి రైతులు

- తిరుపతి ఉద్యాన యూనివర్సిటీ నుంచి రంగాపూర్ బత్తాయి అంటు మొక్కలు దిగుమతి
- పదేళ్లు గడిచినా సక్రమంగా రాని దిగుబడి
- నల్లగొండ జిల్లాలో 350 ఎకరాల్లో ఈ బత్తాయి మొక్కలు నాటిన రైతులు


సక్రమంగా దిగుబడి లేని బత్తాయి తోట

నల్లగొండ రూరల్: తిరుపతి ఉద్యాన యూనివర్సిటీ నుంచి 2014, 2015, 2016 సంవత్సరాల్లో బత్తాయి మొక్కలు తీసుకొచ్చి జిల్లాలో నాటిన రైతులు దిగుబడి రాక నిండా మునిగారు. గత పదేళ్లుగా పెట్టిన పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరులా మారిందని వాపోతున్నారు. గతంలో తిరుపతి ఉద్యాన యూనివర్సిటీ నుంచి రంగాపూర్ బత్తాయి అంటు మొక్కలను తీసుకొచ్చి జిల్లాలో విస్తారంగా నాటి మన్నికైన దిగుబడిని పొందారు. 2014 నుంచి ఈ రంగాపూర్ బత్తాయి అంటు మొక్కలు నాణ్యతగా లేకపోవడంతో అవి నాటిన రైతులు దిగుబడి రాక దివాలా తీశారు. జిల్లాలో 68 మంది రైతులు 350 ఎకరాల్లో ఈ బత్తాయి మొక్కలు నాటారు. అంటు మొక్కలు సాధారణంగా 4వ ఏట నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. 8 ఏళ్లు గడిచినా సాధారణ దిగుబడి కూడా రావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

ఫలితమివ్వని పరిశోధనా కేంద్రం మొక్కలు..

తిరుపతి ఉద్యాన యూనివర్సిటీ మొక్కలు సాగు చేస్తే 25ఏళ్ల పాటు మంచి దిగుబడి వస్తుందని తెగుళ్లు, నీటి ఎద్దడిని తట్టుకుంటుందని అధికారులు రైతుల్లో అవగాహన కల్పించారు. దీంతో ఆ బత్తాయి మొక్కలు నాటిన రైతులు దిగుబడి లేక నేడు దివాలా తీశారు. పరిశోధనా కేంద్రంలో ఆరోగ్యవంతంగా ఉన్న తల్లి మొక్క నుంచి 10 నుంచి 20 కొమ్మలు తొలగించి నిమ్మ జాతికి చెందిన రంగాపూర్ మొక్కపై అంటుకడతారు. ఇలా అంటు కట్టడం వల్ల తెగుళ్లు తట్టుకోవడం, నీటి ఎద్దడిని తట్టుకోవడంతో పాటు నాణ్యతమైన దిగుబడి లభిస్తుంది. తిరుపతి నుంచి తెచ్చి నాటిన మొక్కల్లో దిగుబడి నిమ్మకాయ సైజు కంటే కొంచెం పెద్దగా ఉండటం కొద్దిరోజుల్లోనే పసుపు రంగులోకి మారి రోజుల వ్యవధిలోనే రాలిపోతుంది. ఎక్కువగా బంక తెగులు సోకి చెట్లు ఎండిపోతున్నాయి. సాధారణంగా ఎకరానికి 8 నుంచి 10 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా.. రైతులు తెచ్చి నాటిన మొక్కల్లో కనీసం 5 టన్నుల దిగుబడి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతులంతా జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బత్తాయి చెట్లను పరిశీలించాలని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ నాగపూర్ శాస్త్రవేత్తలకు లేఖ రాశారు.

ఎటూ తేల్చని శాస్త్రవేత్తలు..

రైతులు నాటిన బత్తాయి తోటలను పరిశీలించిన తెలంగాణ, ఏపీ యూనివర్సిటీలకు చెందిన శాస్త్రవేత్తలు దిగుబడి రాకపోవడంపై ఎటూ తేల్చలేదు. యూనివర్సిటీ నుంచి తెచ్చిన మొక్కలు నాణ్యతగా అంటుకట్టలేదని ఎక్కడో బయట వయసు మీరిన మొక్కల నుంచి కొమ్మలు తెచ్చి అంటుకట్టడంతోనే దిగుబడిలో తేడాలున్నట్లు రైతులు అనుభవపూర్వకంగా చెబుతున్నారు. రైతులు తెచ్చి నాటిన మొక్కల మూలాలు ఎక్కడ నుంచి తెచ్చారో శాస్త్రీయ పరిశోధన(డీఎన్‌ఏ) చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యాన యూనివర్సిటీలో శాస్త్రవేత్తల కొరత కారణంగా మొక్కలు అంటుకట్టి రైతులకు ఇవ్వడంలో మమ అనిపించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. నల్లగొండ జిల్లాకు పండ్ల మొక్కలు అందించేందుకు కొండమల్లేపల్లిలో పండ్ల మొక్కల పరిశోధన కేంద్రం ఉన్నప్పటికీ శాస్త్రవేత్తలు లేక పరిశోధన కేంద్రం పడావు పడింది. ఈ కేంద్రంలో కేవలం నిమ్మ మొక్కలను మాత్రమే అంటుగడుతున్నారు.

శాస్త్రవేత్తలు పరిశీలించాల్సి ఉంది



దిగుబడి రాకపోవడం విషయమై ఉద్యాన శాఖ నుంచి నాగపూర్ సైంటిస్టులకు నివేదించాం. రైతులు నాగాపూర్ శాస్త్రవేత్తలతో పరిశోధన చేయించాలని కోరారు. ఏడాది పాటు సస్యరక్షణ చర్యలు సక్రమంగా చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని ఏపీ, తెలంగాణకు చెందిన ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సూచించారు. నాగాపూర్ శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తర్వాతే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– సంగీతలక్ష్మి, జేడీ, జిల్లా ఉద్యాన శాఖ

దిగుబడి సరిగ్గా లేదు



2014లో తిరుపతి యూనివర్సిటీ నుంచి 300 మొక్కలు తీసుకొచ్చి నాటాను. కాయ దిగుబడి నాణ్యతగా లేకపోవడంతో పాటు బంక తెగులుతో వంద మొక్కలు ఎండిపోయాయి. ఎకరానికి 10 టన్నుల దిగుబడి రావల్సి ఉండగా 5 టన్నుల దిగుబడి వస్తుంది. కాయ సైజు పెద్దగా ఉండటం లేదు. ధర లేనప్పుడు తోట మీదనే బత్తాయిని తెంపకుండా ఆపితే 2, 3 రోజుల్లోనే పసుపు రంగులోకి మారి మొత్తం రాలిపోతుంది. 8 ఏళ్లుగా ఆదాయం లేకపోగా కనీసం పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం లేదు. శాస్త్రవేత్తల బృందం తోటను పరిశీలించి సక్రమంగా సస్యరక్షణ చర్యలు చేపట్టలేదని చేతులు దులుపుకున్నారే తప్ప ఇచ్చిన మొక్కల నాణ్యత విషయమై స్పష్టత ఇవ్వలేదు. యూనివర్సిటీ వారు ఇచ్చిన అంటు మొక్కల్లో నాణ్యత లేదు.

– సీహెచ్. శ్రీధర్‌రెడ్డి, పిట్టలగూడెం, గుర్రంపోడు మండలం

ఇళ్ల కూల్చివేతపై సుందర్‌నగర్ వాసుల ధర్నా

- కూల్చివేతలపై మున్సిపల్ కమిషనర్, చైర్మన్ల మధ్య వాగ్వాదం
- బాధితుడి ఇంటిని పరిశీలించిన కమిషనర్, చైర్మన్


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సుందర్‌నగర్ వాసులు

మిర్యాలగూడ టౌన్ : అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి జోలికి వెళ్లకుండా నిరుపేదల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని కూల్చివేశారంటూ మిర్యాలగూడ మున్సిపాలిటీ 36వ వార్డు సుందర్‌నగర్ కాలనీ వాసులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ముందుగా మున్సిపల్ ఛాంబర్స్‌లోకి వెళ్లి కమిషనర్ యూసుఫ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కొంత సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో కొంత మంది కాలనీవాసులు జోక్యం చేసుకొని అలసు పేదవాడి ఇళ్లను ఎవరు కూల్చమన్నారో చెప్పాలని పట్టుబట్టారు. అదే సమయంలో బాధితుడు దండగల రంగయ్య తాను ఆత్మహత్య చేసుకుంటాను అని ఆవేదనతో మాట్లాడంతో ఒక్కసారిగా మరింత వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ విషయం తీసుకున్న టూటౌన్ పోలీసులు మున్సిపాలిటీకి వచ్చారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తాను 36వ వార్డు సుందర్‌నగర్‌లో నాలా పక్కన 15 ఏళ్ల క్రితం ఒక్క చిన్న ఇంటిని నిర్మించుకోని జీవనం కొనసాగిస్తున్నానని, తనకు పట్టా కూడా ఉందని, తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే మున్సిపాలిటీ వారు వచ్చి ఇంటిని కూల్చివేశారని సర్వ కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తన వస్తువులు కూడా తీసుకోనివ్వకుండా వెంటనే కూల్చివేశారన్నారు. నాలా పక్కనే ఇంకా అనేక కట్టడాలు ఉంటే వాటిని దాటి తన ఇంటి వద్దకు వచ్చి కూల్చడమేమిటని అధికారులను ప్రశ్నించారు. దీనిక వెనక ఓ అధికార పార్టీ నేత హస్తం ఉందని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. మరో బాధితుడు తంబిశెట్టి శ్రీను మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాలా పక్కన ఉన్నదనే కారణంతో తన ఇంటి బెస్‌మెంట్ తొలగించడం అన్యాయమన్నారు. అధికార పార్టీని వారికిపేదలంటే ఇంత కక్ష ఉందా అని ప్రశ్నించారు. నాలాపై అనేక మంది నిర్మాణాలను చేపట్టారని వారి కూడా కూల్చివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌లు బాధితుల ఇంటిని పరిశీలించారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం

- డీసీఎంలో విశ్రాంతి తీసుకుంటున్న డ్రైవర్ మృతి


నుజ్జునుజ్జయిన డీసీఎం క్యాబిన్

కట్టంగూర్: మండల కేంద్రంలోని 65వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రం సంగ్రూర్ జిల్లా సునమ్ సతాజ్ గ్రామానికి చెందిన కుల్వీందర్ సింగ్ (25), రాజ్‌బిందర్‌సింగ్‌లు డీసీఎంలో ప్లాస్టిక్ డబ్బాల లోడ్‌తో విజయవాడ నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్నారు. వాహనాన్ని రాజ్‌బిందర్‌సింగ్ నడుపుతుండగా.. కుల్వీందర్ సింగ్ డీసీఎంలో ఎడమ వైపున విశ్రాంతి తీసుకుంటున్నాడు. కట్టంగూర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు రాగానే పాలిష్ బండల లోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో డీసీఎంలో విశ్రాంతి తీసుకుంటున్న కుల్వీందర్ సింగ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎం నడుపుతున్న రాజ్‌బిందర్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీను తెలిపారు.

రెండిళ్లలో చోరీ

దేవరకొండ: దేవరకొండ మండల పరిధిలోని కాసారం గ్రామంలో రెండిళ్లలో చోరీ జరిగింది. సీఐ నరసింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆంబోజు లింగమ్మ శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలో పొలం పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లింది. తిరిగి సాయంత్రం వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. లింగమ్మ ఇంట్లో ఉన్న తులం బంగారంతో పాటు రూ.3వేలు నగదు అదే విధంగా పక్కనే ఉన్న తన కుమారుడి ఇంట్లో ఉన్న 16 తులాల వెండి రూ.5వేల నగదు అపహరణకు గురైనట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

సమగ్ర కులగణన జరపాలి


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నకిరేకల్: కేంద్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేసి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. నకిరేకల్‌లో శనివారం నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎంత జనాభా ఉన్నారు.. వారికి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని కోరారు. చట్ట సభల్లో మన వాటా, మన హక్కు మనకు దక్కాలంటే జెండాలు, పార్టీలను పక్కన పెట్టి పోరుబాట పట్టాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన కామారెడ్డి నుంచి సమగ్ర కుల గణన సాధన యాత్ర ప్రారంభించామని, ఈనెల 31న కరీంనగర్‌లో ముగుస్తుందని తెలిపారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సకినాల రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీసీ కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు కుందారపు గణేష్‌చారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్రురి వెంకటేశ్వర్లు, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సకినాల రవి, యాదవ, రజక పద్మశాలి సంఘాల అధ్యక్షులు తిరుగుడు రవి, పగిళ్ల వెంకన్న, చిలుకురి లక్ష్మీనర్సయ్య, మేడిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడి మందిరం ముస్తాబు


ముస్తాబైన సాయి మందిరం

చింతపల్లి : మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా దేవాలయం ఆదివారం నిర్వహించనున్న గురిపూర్ణిమ ఉత్సవాలకు సిద్ధమైంది. గురిపూర్ణిమ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం శంఖాభిషేకంతో పూజా కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. 5గంటలకు నగర సంకీర్తన, 5.30 గంటలకు కాగడ హారతి, గణపతి హోమం,6.30కి పంచామృతాభిషేకం, 7.30కి సంస్థాన హారతి, అష్టోత్తర పూజ, 10.30గంటలకు యోగశాలలో పూర్ణాహుతి, 11 గంటలకు శంకు పూజ, 12 గంటలకు మధ్యాహ్న హారతి, లక్ష మల్లెలతో పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

జాతీయ రహదారిపై సిమెంట్ ట్యాంకర్ బోల్తా



చౌటుప్పల్ : మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం సిమెంట్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు నుంచి సిమెంట్ లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న ట్యాంకర్ తూప్రాన్‌పేట శివారులో ఒక్కసారిగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలుకాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

బొమ్మలరామారం: ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బొమ్మలరామారం మండలంలో శుక్రవారం చోటు చేసుకోగా.. శనివారం వెలుగులోకివచ్చింది. మండలంలోని మైలారంకింది తండాకు చెందిన దీరావత్ భిక్షపతి నాయక్(24) రాంపల్లిలోని ఆర్‌ఎంసీ ప్లాంట్‌లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. భిక్షపతి నాయక్ తండ్రి మంగ్యా చాలా కాలం క్రితమే చనిపోగా.. తల్లి వాల్కి రెండు నెలల క్రితం మృతిచెందింది. దీంతో తన అక్కతోపాటు తండాలో జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో భిక్షపతి నాయక్ మనస్తాపానికి గురై శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి తిరిగి వచ్చిన అతడి అక్క తలుపు కొట్టినా తీయకపోవడంతో కిటిలోంచి చూసి తమ్ముడు ఉరివేసుకున్నట్లు గుర్తించింది. ఇరుగు పొరుగు వారితో తలుపులు తీయించి వచ్చి చూసేసరికి అప్పటికే భిక్షపతి నాయక్ మృతి చెందాడు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్ గౌడ్ శనివారం తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

చిత్తడి రోడ్డు.. విద్యార్థుల పాట్లు


బురద రోడ్డులో పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్న కొత్తపహాడ్ గ్రామానికి చెందిన విద్యార్థులు

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్-కొత్తపేట గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్డు అధ్వానంగా మారింది. కొర్లపహాడ్ గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాలకు కొత్తపేట గ్రామం నుంచి 50 మంది విద్యార్థులు వెళ్తుంటారు. ఎలాంటి బస్సు, ఆటో సౌకర్యం లేకపోవడంతో కాలినడకన బురద రోడ్డుపై నడిచివెళ్లాల్సి వస్తోంది. కొత్తపేట, కొర్లపహాడ్ గ్రామాలకు చెందిన రైతుల పొలాలు కూడా ఈదారి వెంటే ఉన్నాయి. కొత్తపేట నుంచి నకిరేకల్ పట్టణానికి వెళ్లే ద్విచక్ర వాహనదారులు సైతం ఈదారి గుండానే వెళ్తారు. మూడు కిలోమీటర్లు ఉన్న ఈరోడ్డు మట్టిరోడ్డు కావటంతో ఇటీవల కురిసిన వర్షాలకు చిత్తడిగా మారింది. దీంతో వాహనదారులు, రైతులు నానా ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీరోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కదాడిలో ఒకరికి తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి: కుక్కదాడి చేసిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం నార్కట్‌పల్లిలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఉప్పలయ్య హైస్కూల్ సమీపంలో 11వ వార్డులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న రంగయ్య ఇంటి ముందు నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రంగయ్యకు చెందిన కుక్క ఉప్పలయ్యను కరవడంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా.. గతంలో ఇదే కుక్క 20 మందిని కరిచినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

బావిలో పడి రైతు మృతి

రాజాపేట: వ్యవసాయ పనులు చేస్తుండగా ఓ రైతు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాజాపేట మండలంలోని కుర్రారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నిమ్మల అనంతరెడ్డి (50) రోజుమాదిరిగా తన వ్యవసాయ బావివద్దకు వెళ్లాడు. మోటార్ నీళ్లు పోయకపోవడంతో దానిని సవరిస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. రాత్రివరకు అనంతరెడ్డి ఇంటికి రాకపోవడంతో భార్య అంజమ్మ ఇరుగుపొరుగువారితో కలిసి పొలం వద్దకు వెళ్లి చూడగా.. భర్త బావిలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉపేందర్ తెలిపారు.

నాలుగు గొర్రెపొట్టేళ్లు మృతి

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడంలో విద్యుదాఘాతంలో నాలుగు గొర్రెపొట్టేళ్లు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన ప్రకారం.. కుక్కడం గ్రామానికి చెందిన వల్లపు నర్సయ్య తన గొర్రెపొట్టేళ్లను మేపుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరు వాటికి తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి నాలుగు గొర్రెపొట్టేళ్లు మృతిచెందాయి. వాటి విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.